సాక్షి వనపర్తి

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



వేసవి భత్యం లేనట్టే..!

ఎండాకాలంలో ఉపాధి కూలీలకు చెల్లించే వేసవి భత్యాన్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది.

వివరాలు 8లో ▸



నేడు న్యాక్ బృందం రాక

కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గురువారం న్యాక్ బృందం రానుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /24.2

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రంగా ఉంటుంది. మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి



వనపర్తి క్రైం: జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సునీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని.. కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు న్యాయవాదులు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి రాజేష్‌బాబు, వనపర్తి సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రజని, రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి జానకి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, న్యాయవాదులు అనంతరాజు, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌డెస్క్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మిషన్ భగీరథ పథకం తాగునీళ్ల సరఫరాలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ప్రజల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు 08542-245463 నంబర్‌ను మిషన్ భగీరథ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నంబర్ అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ పరీక్షలు

వనపర్తి టౌన్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రెండోరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పదోతరగతికి ఒకటి, ఇంటర్‌కు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి మధుకర్ తెలిపారు. రెండోరోజు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. 10వ తరగతి పరీక్షకు 273 మందికిగాను 230 మంది హాజరుకాగా, 43 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షకు 338 మందికిగాను 273 మంది హాజరుకాగా.. 65 మంది గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్-2023'పై అవగాహన

వనపర్తి: గ్రామపంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్-2023పై డీఆర్డీఓ నర్సింహులు బుధవారం క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. వెయ్యి నుంచి 5 వేల పైబడి జనాభా ఉన్న గ్రామపంచాయతీలు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలతో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు అందుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అవార్డులు పొందేందుకు పోటీ పడాలని కోరారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్, అదనపు డీఆర్డీఓ కృష్ణయ్య, డీఎల్‌పీఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' విడుదల

వనపర్తిటౌన్: మార్చి నెలకు సంబంధించి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికుల ఆసరా పింఛన్ డబ్బులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందని.. పోస్టల్ సేవల ద్వారా పొందాలని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ సిద్ధార్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి, జడ్చర్ల పోస్టల్ పరిధిలోని జడ్చర్ల, నారాయణపేట, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ పోస్టాఫీసుల్లో వారం పాటు చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతుందని.. వేలిముద్ర పడని పింఛన్‌దారులు గ్రామపంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో డబ్బులు తీసుకోవచ్చని పేర్కొన్నారు.

ధాన్యం.. వర్షార్పణం

అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు

- చిన్నంబావిలో అత్యధికంగా 65.9 మి.మీ. వర్షపాతం **నమోదు**
- చెరువును తలపించిన వనపర్తి మార్కెట్‌యార్డు
- వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోనూ భారీ వర్షం
- లబోదిబోమంటున్న రైతులు.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

వనపర్తి/పాన్‌గల్: జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దయింది. వనపర్తి మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన వరి ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పి ఉన్నా.. యార్డులో భారీగా నీరు నిల్వడంతో పెద్ద మొత్తంలో తడిసిపోయింది. ఒకటి, రెండు రోజుల్లో చేతికి డబ్బులు అందుతాయనుకున్న సమయంలో ధాన్యం వర్షార్పణం కావటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఉదయాన్నే తడిసిన ధాన్యాన్ని అరబెట్టేందుకు యత్నించడం కనిపించింది. ఒక్క వనపర్తి మార్కెట్‌యార్డులోనే వందకుపైగా కుప్పలు.. సుమారు ఆరు వేల బస్తాల ధాన్యం తడిసినట్లు అధికారులు అంచనా వేశారు. వనపర్తి పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన సుమారు 1,500 బస్తాల ధాన్యం సైతం తరలించకపోవడంతో తడిసిపోయింది. తూకం చేసినా.. నష్టం తమపై మోపుతారేమోనన్న భయంలో రైతులు ఉన్నారు.

జిల్లా సగటు వర్షపాతం 32.5 మి.మీ...

మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షంతో జిల్లా సగటు వర్షపాతం 32.5గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. చిన్నంబావి మండలంలో అత్యధికంగా 65.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి, వీపనగండ్ల, కొత్తకోట మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం.. మిగతా మండలాల్లో స్వల్పంగా వర్షం కుసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రోజు నాటికి ఏప్రిల్ సాధారణ వర్షపాతం 556.2 మి.మీ. కాగా.. 845.1 మి.మీ. వర్షం కురిసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

- గోపాల్‌పేట కొనుగోలు కేంద్రంలోని ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. తడిసిన ధాన్యాన్ని అరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.
- పాన్‌గల్‌తో పాటు రేమద్దుల, శాగాపూర్, మాందాపూర్, చింతకుంట, దావాజీపల్లి, అన్నారం తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన వరి ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా అడుగు భాగం తడిసింది. తడిసిన ధాన్యాన్ని బుధవారం రైతులు ఆరబెట్టుకోవడం కనిపించింది. మరికొన్ని గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నేలకొరిగాయి.



వనపర్తి మార్కెట్‌యార్డులో వర్షపు నీటికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని దగ్గరకు చేరుస్తున్న రైతులు



పాన్‌గల్‌లో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళలు

మండలాల వారీగా వర్షపాతం నమోదు ఇలా..	
మండలం	కురిసిన వర్షం (మి.మీ.లలో..)
చిన్నంబావి	65.9
వీపనగండ్ల	49.3
వనపర్తి	45.0
గోపాల్‌పేట	40.5
రేవల్లి	36.4
శ్రీరంగాపురం	36.1
కొత్తకోట	32.7
పాన్‌గల్	31.09
పెబ్బేరు	25.5
ఖిల్లాఘనపురం	23.5
మదనాపురం	18.0
ఆత్మకూరు	17.8
పెద్దమందడి	16.5
అమరచింత	15.7



పాన్‌గల్‌లో కల్లంలో నిలిచిన నీరు

వారం క్రితం ధాన్యం తీసుకొచ్చా..



మూడెకరాల్లో వరి సాగు చేశా. కోతలు పూర్తిచేసి వారం క్రితమే మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాం. హమాలీలు లేరని నిర్వాహకులు కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సకాలంలో కొనుగోలు చేయక ధాన్యం తడిసింది. తెచ్చిన మరునాడు కొనుగోలు చేసి ఉంటే నష్టం వచ్చేది కాదు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. నాలాంటి చాలా మంది రైతుల ధాన్యం తడిసింది.

– సురేష్, చిట్యాల, వనపర్తి

మార్కెట్ చెరువును తలపించింది..



మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మార్కెట్ నిండా నీరు నిలిచి చెరువును తలపించింది. దీంతో టార్పాలిన్లు కప్పిన ధాన్యంతో పాటు తూకాలు చేసి సంచుల్లో నింపిన ధాన్యం కూడా తడిసింది. ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– కమలమ్మ, చిట్యాల తూర్పుతండా, వనపర్తి

తూకంలో జాప్యంతోనే..



కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తూకం చేయడానికి నిర్వాహకులు జాప్యం చేస్తుండటంతో వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ధాన్యంపై కప్పేందుకు రాయితీపై టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ఇలాంటి సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సకాలంలో తూకాలు చేసి ఇబ్బందులు తొలగించాలి.

– ఎనుముల రాములు, రైతు, పాన్‌గల్

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్..

గోపాల్‌పేట: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసిపోయింది. బుదవారం అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ రేవల్లి మండలంలోని చెన్నారం, గొల్లపల్లి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తడిసిందని రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం గోపాల్‌పేటలోని రెండు, బుద్ధారంలోని రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులు, అధికారులతో మాట్లాడారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐకేపీ సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధల మేరకు తేమశాతం తనిఖీ చేసి కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట రేవల్లి తహసీల్దార్ శ్రీరాములు, గోపాల్‌పేట తహసీల్దార్ సునీత ఉన్నారు.



రేవల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్



జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో నిలిచిన వర్షపు నీరు



ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటలో వర్షపు నీటిలో కొట్టుకుపోయిన వరిధాన్యం



పాన్‌గల్ మండలం అన్నారంలో నేలకొరిగిన వరి పంట

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నిర్దేశిత పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్ హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎన్నికల అధికారులు చేసిన సూచనలను వివరించారు. జూన్‌లో ఈవీఎం, వీవీప్యాట్ల ఎఫ్ఎల్‌సీ నిర్వహించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇచ్చి వీడియో రికార్డింగ్ నిర్వహిస్తూ ఎఫ్ఎల్‌సి పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించి మినిట్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పిస్తూ సప్లిమెంటరీ ఓటరు జాబితా విడుదల చేయాలని.. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఓటింగ్ తక్కువ నమోదైన ప్రాంతాల్లో ఓటరు ప్రాముఖ్యత అవగాహన కార్యక్రమాలు వినూత్నంగా నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు.

సవ్యంగా తాగునీటి సరఫరా..

ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా రోజు నీటిశుద్ధి కేంద్రాల నుంచి సరఫరా సక్రమంగా జరిగేలా మిషన్ భగీరథ ఇంజినీర్లు పర్యవేక్షించాలని సూచించారు. నేటికీ ఏయే గ్రామాలకు తాగునీటి సరఫరా లేదో తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం కలగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని.. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీగలు తెగిపోకుండా, స్తంభాలు కూలిపోకుండా చూడాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి క్రైం: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు, ప్రతి ఊరు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పాయిపల్లి, తండాలో మంగళవారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించి బుధవారం ఉదయం ఇల్లిల్లూ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.2.50 కోట్లతో అప్పాయిపల్లి నుంచి గుంతతండా వరకు 3.5 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పాయిపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రూ.20 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించనున్నామని, పల్లె, పట్టణ ప్రగతితో సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకుంటున్నామని తెలిపారు. హరితహారం, పల్లె ప్రకృతివనాలతో గ్రామాలకు కొత్తశోభ సంతరించుకుందని, వైకుంఠధామల నిర్మాణాలతో గ్రామాల్లో ఉన్న సుదీర్ఘ సమస్య తొలగిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలతో మురుగు సమస్య తొలగి పరిశుభ్రంగా తయారయ్యాయని వివరించారు. పచ్చదనానికి పల్లెలు ఆదర్శంగా నిలుస్తాయని.. అందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పల్లెలకు ఇచ్చిన అవార్డులే నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్యం, పురుషోత్తంరెడ్డి, విష్ణుయాదవ్, ఉస్మాన్, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



అప్పాయిపల్లితండాలో పర్యటిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

'మల్లమ్మకుంట' నిర్మాణానికి జీఓ విడుదల

అలంపూర్: మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఎమ్మెల్యే అబ్రహం జీఓ కాపీని అందుకున్నారు. హైదరాబాద్ ప్రగతి భవన్‌లో సీఎంను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఎమ్మెల్యేలు అబ్రహం, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు కలిశారు. రెండోవిడతలో చేపట్టే రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.386 కోట్లు మంజూరు చేస్తూ జీఓ అందజేశారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే అబ్రహం ధన్యవాదాలు తెలిపారు.

- నాలుగు దశాబ్దాలుగా ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఈ పరిస్థితుల్లో రాజోలి మండలం తుమ్మిళ్ల వద్ద తుంగభద్ర నది ఒడ్డున తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రిజర్వాయర్లతో కలిపి రూ.783 కోట్ల అంచనా వ్యయంగా పేర్కొన్నారు. మొదటి విడతలో పంప్‌హౌజ్ నిర్మాణం, ఆర్డీఎస్ వరకు 9.6 కి.మీ ప్రెజర్ పైప్‌లైన్ వంటి పనులు చేపట్టి సాగునీటిని అందిస్తున్నారు. సెకండ్ ఫేస్‌లో మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు గ్రామాల వద్ద రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.386 కోట్లు కేటాయించింది. అందులో మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టడానికి వీలుగా జీఓను విడదల చేసింది.



పెత్తనం లేని రాజకీయాలను ఆస్వాదిద్దాం

మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: నియోజకవర్గంలో పెత్తనం లేని రాజకీయాలను ఆస్వాదించేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి కోరారు. హాథ్‌సే హాథ్ జోడోయాత్రలో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని టీచర్స్‌కాలనీ, జంగాలగుట్ట, అభయాంజనేయకాలని, సాగర్‌కాలని తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయం అవకాశవాదంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌ను ఆదరించకపోతే అవినీతిపరులు చెలరేగి అందినకాడికి దోచుకుంటారని మండిపడ్డారు. అభివృద్ధి అంటే ప్రజలందరూ వృద్ధిలోకి రావాలని.. పాలకులు ఒక్కరే ఎదిగితే సరిపోదని ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత ప్రతి పౌరుడిలో కనబడుతుందని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, ఓబీసీ జిల్లా చైర్మన్ కోట్ల రవి, నాయకులు బొంబాయి మన్యంకొండ, విజయవర్ధన్‌రెడ్డి, కదిరె రాములు, బాబా, అబ్దుల్లా, దివాకర్, రోహిత్ పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న డా. చిన్నారెడ్డి

ఏసీబీ వలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

- బిల్లుల మంజూరు కోసం రూ.9 వేలు డిమాండ్
- నాగర్‌కర్నూల్‌లో లంచం తీసుకుంటుండగా పట్టివేత

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల మంజూరుకు లంచం తీసుకుంటూ ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మేడిమాకుల శేఖర్ రూ.9 లక్షలు వెచ్చించి పాఠశాల సైన్స్ ల్యాబ్ నిర్మాణం పూర్తి చేయించారు. ఇందుకు సంబంధించిన బిల్లులు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. విద్యాశాఖలోని సర్వశిక్షా అభియాన్ కింద ఔట్‌సోర్సింగ్‌లో సైట్ ఇంజినీరింగ్ (ఏఈ)గా పనిచేసిన కె.మహేందర్‌గౌడ్ పది నెలల కిందట ఉద్యోగం మానేశాడు. చివరి విడతగా పెండింగ్‌లో ఉన్న రూ.2లక్షల బిల్లు మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేశాడు. రూ.9వేలు ఇస్తేనే ఎంబీ రికార్డు ఆమోదిస్తానని చెప్పాడు. ఇప్పటికే పలుమార్లు డబ్బులిచ్చి విసిగివేసారిన బాధితుడు శేఖర్ ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఉన్న ఓ వస్త్ర దుకాణంలో బాధితుడి నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటుండగా మాజీ ఏఈ మహేందర్‌గౌడ్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తర్వాత మహబూబ్‌నగర్‌లోని సర్వశిక్షా అభియాన్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి పలు ఫైళ్లను పరిశీలించారు. నిందితుడిని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


దస్తగిరి (ఫైల్)

మదనాపురం: మండలంలోని ఊకచెట్టు వాగులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ మురళి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రామన్పాడుకు చెందిన వాకిటి దస్తగిరి (45) గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగులో చేపలు పట్టేందుకు మంగళవారం వెళ్లారు. రాత్రి పొద్దుపోయే వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది బుధవారం ఉదయం వాగు పరిసరాల్లో వెదికారు. చెప్పులు, దుస్తులు ఒడ్డున కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాలింపు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ట్రాక్టర్ కిందపడి బాలుడి దుర్మరణం


శివప్రసాద్ (ఫైల్)

మరికల్: ట్రాక్టర్ కింద పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన బుధవారం మండలంలోని ఎలిగండ్ల శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. తిరుపతమ్మ, వెంకటేష్ దంపతులకు ముగ్గురు కుమారులు. మంగళవారం రాత్రి వర్షం కురువడంతో బుధవారం ఉదయం పెద్ద కుమారుడు శివప్రసాద్ (16) ట్రాక్టర్ తీసుకెళ్లి పొలం దున్ని తిరిగి వస్తుండగా గ్రామశివారులో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శివప్రసాద్ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోవడంతో పొక్లెయిన్ సాయంతో బయటకు తీసి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి..

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి కథనం మేరకు.. మండలంలోని కొండేరుకు చెందిన కుర్వ తిప్పన్న (46) వేములలో బంధువులు చేసిన పెద్దమ్మ దేవరకు వెళ్లి తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై పుటాన్‌దొడ్డి శివారులోకి రాగానే ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కల్లుకు బానిసై వివాహిత ఆత్మహత్య


శశికళ (ఫైల్)

చిన్నచింతకుంట: కల్లుకు బానిసై వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని పాతపాలెంకు చెందిన శశికళ (27)కు పదకొండేళ్ల క్రితం చిన్నచింతకుంట మండలంలోని తిర్మలాపురం చెందిన లక్ష్మన్నతో వివాహమైంది. వీరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈమె కల్లుకు బానిసై తరుచూ తాగుతుండేది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను మందలించారు. ఈ నెల 23న ఇంట్లోనే పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చెందింది. మృతురాలి తండ్రి పెద్ద మునెప్ప బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌బాబు తెలిపారు.

ప్రమాదవశాత్తు వరి గడ్డి దగ్ధం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో సర్పంచ్ అనితకు చెందిన వరిగడ్డి ప్రమాదవశాత్తు బుధవారం దగ్ధమైంది. జిల్లా కేంద్రం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోపే గ్రామ సమీపంలో పశువుల మేత కోసం నిల్వ ఉంచిన ఐదు ట్రాక్టర్ల వరి గడ్డి పూర్తిగా కాలిపోయిందని బాధితులు తెలిపారు. దీని విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో గ్రామ సింహాలు బెంబేలెత్తిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని నాగవరంలో మంగళవారం రాత్రి తినుబండరాలు తెచ్చుకునేందుకు దుకాణానికి వెళుతున్న రుషివర్ధన్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. బాలుడి నడుము కింద భాగంలో, ఎడమ చేతికి గాయాలయ్యాయి. స్థానికంగా ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం బాలుడిని మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ జయసుధ బాలుడి కుటుంబాన్ని పరామర్శించారు.

వేసవి భత్యం లేనట్టే!


ఉపాధి పనుల్లో కూలీలు (ఫైల్)

- ఉపాధి కూలీలకు మొండిచెయ్యి
- కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఆప్షన్ తొలగించిన కేంద్రం
- మండి పడుతున్న కూలీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కూలీలకు ఉన్న గ్రామాల్లోనే ఉపాధి కల్పించేందుకు 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చింది. వేసవిలో కూలీలసంఖ్య పెంచి ప్రోత్సహించేందుకు వేసవి భత్యం ఇచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం ఆ అలవెన్స్‌ను ఎత్తివేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఐసీ అనే కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఆప్షన్ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగిన టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న ఆప్షన్‌ను.. ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో ఎత్తివేసింది.

■ గ్రామాల్లో చాలామందికి ఉపాధి పనులే జీవనాధారం. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొంత తగ్గుముఖం పట్టడంతో ఉపాధి కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో.. ఆ అయిదు నెలలు కూలీలకు 20 నుంచి 30 శాతం వేసవి అదనపు భత్యం చెల్లించేది. కొత్త సాఫ్ట్‌వేర్‌లో అదనపు భత్యం ఊసే లేకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. వేసవిలోనే ఉపాధి పనులు జోరుగా సాగుతాయని.. అదనపు భత్యం లేకుంటే కూలీల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 2.62 లక్షల మంది..

మహబూబ్‌నగర్ జిల్లాలో 2.62 లక్షల మంది కూలీలు ఉండగా.. 1.53 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 1.01 లక్షల జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. 1.58 లక్షల మంది కూలీలు పనులు చేస్తూ యాక్టివ్‌లో ఉన్నారు. 10,305 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేశాయి. 68 వేల కుటుంబాలు ఉపాధి పనుల్లో భాగస్వాములయ్యారు.

కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చింది..



ఉపాధి కూలీల వివరాల నమోదుకు ఇటీవలే కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చింది. ఈ నెల నుంచి కొత్త సాఫ్ట్‌వేర్‌లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇందులో వేసవి భత్యం ఆప్షన్ లేదు. ప్రభుత్వం నుంచి పూర్తి ఆదేశాలు రావాల్సి ఉంది.
– యాదయ్య, డీఆర్డీఓ

నేడు కొండనాగులకు న్యాక్ బృందం


కొండనాగులలోని ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గురువారం న్యాక్ బృందం రానుంది. రెండురోజుల పాటు ఆయా విభాగాలను పరిశీలించనున్నారు. గ్రంథాలయం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, బొటానికల్ గార్డెన్, ఆడిటోరియం. వ్యాయామశాలతో పాటు సముదాయాన్ని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లేశం బుధవారం మాట్లాడారు. మొదటి విడతలో బీ–ప్లేస్ సాధించిన కళాశాల, ఈసారి మరింత మెరుగైన గ్రేడ్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృందానికి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రొఫెసర్ అశుతోష్ గోష్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని, రాజస్థాన్‌కు చెందిన ప్రొఫెసర్ అవంత్‌వీర్ సింగ్ మదనావత్ మెంబర్ కోఆర్డినేటర్‌గా, మంగళీమిశ్రా సభ్యునిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.


సైన్స్ ల్యాబ్


గ్రంథాలయం

తక్కువ ధరకు వస్తువులు ఇప్పిస్తానని మోసం

మహబూబ్‌నగర్ క్రైం: 'నేను మీ పాత స్టూడెంట్‌ను.. ఆర్మీలో జాబ్ వచ్చింది.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మిలటరీ క్యాంటీన్‌లో పని చేస్తున్నాను. తక్కువ ధరకు వస్తువులు ఇప్పిస్తాను.' అని డబ్బులు తీసుకుని ఓ సైబర్ నేరస్తుడు మోసం చేశాడు. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని మర్లుకు చెందిన శ్రీనివాసచారి పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాలలో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈ నెల 10న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌గౌడ్‌కు 93920 56815 నంబర్ నుంచి ఫోన్ చేసి నేను మీ పాత స్టూడెంట్ పవన్‌కల్యాణ్ మాట్లాడుతున్నాను.. నాకు ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న మిలటరీ క్యాంటీన్‌లో పనిచేస్తున్నాను. మీకు ఏవైనా వస్తువులు కావాలంటే తక్కువ ధరకు ఇప్పిస్తానని చెప్పాడు. ఇది నమ్మిన శ్రీకాంత్‌గౌడ్ తనకు యాపిల్ వాచ్, ల్యాప్‌టాప్ కావాలని చెప్పాడు. దీంతో సైబర్ నేరస్తుడు 81790 90356 నంబర్‌కు డబ్బులు పంపాలని చెప్పాడంతో ఒకసారి రూ.19,500, మరోసారి రూ.20వేలు పంపాడు. ఆ తర్వాత ఈ విషయం క్లర్క్ శ్రీనివాసచారి కూడా చెప్పడంతో ఆయన ఎయిర్ కండిషనర్, రైస్ కుక్కర్ కావాలని చెప్పాడంతో ఇతడి నుంచి రూ.20వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. ఆ తర్వాత వీళ్ల వస్తువుల ఫొటోలు వాట్సాప్ పెట్టాలని ఫోన్ చేస్తుంటే.. అందుబాటులోకి రావడం లేదు. మోసపోయామని వారు వెంటనే 1930కు ఫిర్యాదు చేయగా.. వారు పంపిన నగుదు ఫ్రీజ్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంటల దిగుబడికి భూసార పరీక్షలు కీలకం

బిజినేపల్లి: పంటల దిగుబడికి భూసార పరీక్షలు ఎంతో కీలకమని.. రైతులు భూమిలోని పోషకాలను తెలుసుకోవడానికి తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించాలని పాలెం కేవీకే కోఆర్డినేటర్ డా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వసంతాపూర్‌లో భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమంతో పాటు భూసార పరీక్షల కోసం మట్టిని ఏవిధంగా సేకరించాలో రైతులకు వివరించారు. అలాగే, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల జాతీయసేవా పథకం ప్రత్యేక శిబిరం మూడో రోజు మట్టి నమునాల సేకరణ నిర్వహించి ఆయా నేలల్లో మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలి, పోషకాలను ఏవిధంగా తెలుసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాలెం కేవీకే శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


మట్టి నమూనాలను ఏవిధంగా సేకరించాలో వివరిస్తున్న విద్యార్థులు శాస్త్రవేత్తలు

పెరటి తోటల సాగుకు 'అవంచ' ఎంపిక

కూరగాయలు, ఇతర పంటల సాగు విషయాలను రైతుల వద్ద సేకరించి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రొఫెసర్ డా.ప్రీతి సూచించారు. బుధవారం తిమ్మాజీపేట మండలంలోని అవంచ గ్రామాన్ని రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ విశ్వవిద్యాలయ విస్తరణ విభాగం ఆధ్వర్యంలో పెరటి తోటల సాగు కార్యక్రమం కింద ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఇంటి పరిసరాల్లో ఎలాంటి కూరగాయల పంటలను సాగు చేసుకోవాలి, అందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పేరటి తోటల సాగు వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కమల్‌కుమార్, ఏఈవో సాయిరాం, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాన్‌గల్ ఖిల్లాను పునరుద్ధరిస్తాం


కోటపై చారిత్రక కట్టడాన్ని పరిశీలిస్తున్న ఏడీ బుజ్జి

- పురావస్తుశాఖ ఏడీ బుజ్జి

పాన్‌గల్: పాన్‌గల్ ఖిల్లాలోని చారిత్రక కట్టడాలను పునరుద్ధరించనున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పురావస్తుశాఖ ఏడీ బుజ్జి వెల్లడించారు. బుధవారం ఆమె సిబ్బందితో కలిసి ఖిల్లాలో శిథిలావస్థకు చేరిన కట్టడాలను పరిశీలించి మరమ్మతుల వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఖిల్లాను పరిరక్షించాలని, చారిత్రక కట్టడాలను భావితరాలకు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వానికి చేసిన సిఫార్సు మేరకు తమశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని వివరించారు. త్వరలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సందర్శించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు మునీరుద్దీన్ ఉన్నారు.

సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారిగా గద్వాల వాసి



గద్వాల రూరల్: హైదరాబాద్‌లో నిర్మించిన సచివాలయానికి చీఫ్ సెక్యూరిటీ అధికారిగా గద్వాలకు చెందిన అదనపు కమాండెంట్ పి.వెంకట్రాములును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలోని వడ్లవీధికి చెందిన వెంకట్రాములు స్థానిక మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆ రోజుల్లో ఎన్‌సీసీ అండర్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. అదేవిధంగా ఎన్‌సీసీ 'సి' సర్టిఫికెట్ కూడా పొందారు. అనంతరం ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా ఉద్యోగం సాధించి అదనపు కమాండెంట్ స్థాయికి ఎదిగారు. వెంకట్రాములు తండ్రి చాకలి ఎర్ర దౌలన్న లాండ్రి దుకాణం నిర్వహించగా.. ఇద్దరు సోదరులు కూడా ఉన్నతస్థాయి పోలీసు ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. వెంకట్రాములు నియామకంపై గద్వాల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

గొడ్డలి, బండరాయితో దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: పొలంలో పశువులను ఎందుకు మేపారని అడిగినందుకు నలుగురు వ్యక్తులు కలిసి ముగ్గురిపై గొడ్డలి, బండరాయితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని మాచన్‌పల్లికి చెందిన మామిడిమాడ వెంకటమ్మకు సంబంధించిన పొలంలో ఇటీవల వరికోత మిషన్ ద్వారా వరి చేను కోయడంతో గడ్డి పొలంలో మిగిలిపోయింది. దీంతో అదే గ్రామానికి చెందిన చంద్రయ్యకు సంబంధించిన గొర్రెలను పొలంలో మేపవద్దని వెంకటమ్మ అతనికి చెప్పి పొలం దగ్గరి నుంచి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత చంద్రయ్య తన గొర్రెలను పొలంలో మేపడంతో బుధవారం ఉదయం వెంకటమ్మ గొర్రెలను తమ పొలంలోకి ఎందుకు వదిలారని అడిగింది. దీంతో చంద్రయ్య అతని భార్య సుజాత గొడవపడి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు ఆమెపై రొకలిబండతో దాడి చేశారు. ఆ తర్వాత వెంకటమ్మ కేకలు వేయడంతో అక్కడికి వచ్చిన ఆమె భర్త చెన్నయ్యపై కేశవులు అనే వ్యక్తి గొడ్డలితో తలపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. తండ్రిపై దాడి చేస్తున్నారని కొడుకు రమేష్ అడ్డురావడంతో అతనిపై గణేష్ అనే వ్యక్తి బండరాయితో తలపై కొట్టాడు. బాధితురాలు వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకుపై చంద్రయ్య, సుజాత, కేశవులు, గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూతురి ఇంటికివచ్చి.. పిడుగుపడి మృతి


రామప్ప (ఫైల్)

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డిలో పిడుగుపాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ వివరాలు.. కర్ణాటకలోని కొంకాల్ గ్రామానికి చెందిన రామప్ప(55) తన భార్య వన్నమ్మతో కలిసి కొంతకాలంగా హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. మంగళవారం తమ గ్రామంలో మారెమ్మజాతర ఉండటంతో రావాలని తల్లిదండ్రులు రామప్ప, వన్నమ్మకు కూతురు పద్మ ఫోన్ చేసింది. దీంతో వారు రెండ్రోజుల క్రితం మురహర్‌దొడ్డి గ్రామానికి వచ్చారు. మంగళవారం సాయంత్రం వర్షం కురిసిన తర్వాత కూతురు బిడ్డ మనవరాలు అఖిలతో పాటు అదే కుటుంబానికి చెందిన మరో అమ్మాయి మమతతో ఇంటిపక్కన ఉన్న వేపచెట్టు కింద కూర్చున్నారు. పెద్దశబ్దంతో అకస్మాత్తుగా చెట్టుపై నుంచి పిడుగుపడింది. దీంతో ఈ ముగ్గురు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని కుటుంబ సభ్యులు రాయిచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తండ్రి చనిపోయారు. కూతురు అఖిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పిడుగుపాటుకు గురైన వారిని ఆస్పత్రికి తరలించేందుకు వెంటనే గ్రామస్తులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. కానీ సుమారు గంట తర్వాత గ్రామానికి అంబులెన్స్ వచ్చింది. క్షతగాత్రులను సరైన సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్లకపోవడం వల్లే రామప్ప మృతి చెందాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పొట్టనబెట్టుకున్న 'పిడుగు'

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత పిడుగుపాట్లకు మూగజీవాలు ప్రాణాలు వదిలాయి. దీంతో ఉదయం వాటిని గమనించిన యజమానులు విలవిలలాడారు. జడ్చర్ల మండలంలో ఈనడానికి సిద్ధంగా ఉన్న ఓ గేదె మృత్యువాత పడింది. తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో మూగజీవాలు మృత్యువాత
- ప్రాణాలు వదిలిన ఓ వ్యక్తి


క్యాతన్‌పల్లిలో మృతిచెందిన కాడెద్దు


ఆల్వాన్‌పల్లిలో..

జడ్చర్ల: మండల పరిధిలోని ఆల్వాన్‌పల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం రాత్రి పిడుగుపడి రెండు గేదెలు మృతిచెందాయి. పాడి కోసం ఇటీవలనే రూ.60 వేలు వెచ్చించి తీసుకువచ్చిన గేదెతో పాటు మరో గేదె పిడుగుపాటుకు గురయ్యాయని సంబందిత రైతు సత్యంరెడ్డి వాపోయాడు. రేపో మాపో ఈనడానికి సిద్ధంగా ఉన్న గేదె మృత్యువాత పడడంతో లబోదిబోమన్నారు. దాదాపు రూ.80 వేలు నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా సాయం అందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పాగుంటలో..

కేటీదొడ్డి: పాగుంట గ్రామానికి చెందిన రైతు కుర్వ శివప్ప తన పొలంవద్ద కట్టేసిన గేదె, దూడ మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పంచానామా నిర్వహించారు.

చేగుంటలో..

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన రైతు ఏర్రగొల్ల భీమయ్యకు చెందిన మూడు గేగెలు పిడుగుపడి మృతి చెందాయి. దీంతో తనకు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు కుటుంబం తెలిపింది.

క్యాతన్‌పల్లిలో కాడెద్దు..

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో పిడుగుపాటుకు గురై కాడెద్దు మృతి చెందింది. మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామానికి చెందిన ఎం.లాలప్ప రోజులాగే తన కాడెద్దులను పొలం వద్ద మామిడి చెట్టు కింద కట్టేశాడు. ఉదయం వెళ్లి చూడగా ఒక ఎద్దు చనిపోయింది. రూ.60 వేలు విలువ ఉంటుందని తెలిపారు.

అమీన్‌పూర్‌లో..

ఊట్కూర్: మండలంలోని అమీన్‌పూర్‌లో పిడుగుపాటుకు కాడెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు రామప్ప గ్రామ శివారులో పశువుల పాకలో కాడెద్దులను కట్టేశాడు. బుధవారం ఉదయం పశువులకు మేత వేయడానికి వెళ్లగా కాడెద్దు మృతి చెంది ఉండటం గమనించాడు. పశువైద్య అధికారికి సమాచారం అందించడంతో వారు పంచనామా చేశారు. సుమారు రూ.90 వేలు విలువ ఉంటుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిర్సవాడలో..

తాడూరు: పిడుగుపాటుకు పాడి గేదె మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని సిర్సవాడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పర్వతాలు తన పొలం దగ్గర ఏర్పాటు చేసుకున్న పాకలో చెట్టుకు పాడిగేదెను కట్టేసి ఉంచాడు. పిడుగుపాటుకు పాడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. రూ.60 వేలు విలువ ఉంటుందని రైతు తెలిపారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

నవాబుపేట మండలం పోమాల్‌కు చెందిన రైతు పెంటయ్య పొలంలో చెట్టుకు కట్టేసిన ఎద్దు పిడుగుపాటుకు మృతి చెందాడు. దీంతో తనకు రూ.60వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

బస్సు బోల్తా.. ప్రయాణికులు సురక్షితం


ఘటనా స్థలంలో బస్సు

ఉండవెల్లి: జాతీయ రహదారిపై బస్సు అదుపుతప్పి బోల్తాపడగా.. అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గ్రామస్తుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బుధవారం తెల్లవారుజామున 5.40 ప్రాంతంలో ఉండవెల్లి శివారులో ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో బారిగేట్లను ఢీకొని బోల్తాపడింది. అందులో ఉన్న ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్, 24 మంది ప్రయాణికులు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యానాయక్, ఎస్ఐ బాలరాజు పరిశీలించారు. జాతీయ రహదారిపై బారిగేడ్లు ఏర్పాటు చేయడంతో అదుపు చేయలేక బస్సు బోల్తా పడినట్లు ప్రత్యక్షులు తెలిపారు. నేషనల్ హైవే సిబ్బంది క్రేన్ సాయంతో బస్సును పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

'మహిళా సమ్మాన్'తో అధిక వడ్డీ

జడ్చర్ల టౌన్: బాలికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకంతో అధిక వడ్డీతో లబ్ధి చేకూరుతోందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ దేవిరెడ్డి సిద్ధార్థ పిలుపునిచ్చారు. బుధవారం బాదేపల్లి పోస్టల్ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రవికుమార్, మాధవయ్య, మోహన్‌లతో కలసి ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సమ్మాన్ సేవింగ్స్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి మైనర్ బాలిక తరఫున సంరక్షకుడు కనీసం రూ.వెయ్యితో గరిష్టంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏడాదికి 7.5 శాతం వడ్డీ చెల్లిస్తామని, మూడు నెలలకోసారి వడ్డీ లెక్కించి ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. ఎవరికైనా అత్యవసరంగా డబ్బులు అవసరమైతే ఆరు నెలల తరువాత 40 శాతం అడ్వాన్స్‌గా తీసుకోవచ్చన్నారు. వనపర్తి పోస్టల్ డివిజన్ పరిధిలో మొత్తం 27 వేల ఖాతాలు తెరిపించాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే వెయ్యి ఖాతాలు తెరిచామని, ఖాతాదారులకు వివరించి ఖాతా తెరిపించేలా చూడాలని ఉద్యోగులకు సూచించారు.

బొలెరో ఢీ : ఐదుగురికి గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

గోపాల్‌పేట: బొలెరో వాహనం ఢీకొని ఐదుగురు గాయపడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షుల కథనం మేరకు.. మండల కేంద్రంలో బుధవారం సంత కావడంతో హనుమాండ్లగడ్డ, రాంనగర్‌కాలనీకి చెందిన ముగ్గురు మహిళలు, ఓ బాలుడు పోలీస్‌స్టేషన్ పక్క నుంచి సంతకు వెళ్తున్నారు. అదే సమయంలో బస్టాండ్ వైపు నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమారి, అనూష, మమత, మరో బాలుడికి గాయాలయ్యాయి. వాహనం ఆగకుండా ఏదుట్ల వైపు వెళ్తుండటంతో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెంబడించి ఆపేందుకు యత్నించగా అతడిని ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. చివరకు ఏదులలోని స్థానికులు వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని ఎస్ఐ మల్లేష్ వద్ద ప్రస్తావించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని.. పూర్తి వివరాలు తీసుకొని కేసు నమోదు చేస్తామని తెలిపారు. కిరణ్‌కుమారికి తల, ముఖంపై గాయాలుకావడంతో వనపర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019.

WANTED
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K-18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899

సాక్షి ద్వారా మీ ఇష్టుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి. కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీతిలో క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. – సాక్షి మేనేజర్